# మత్తకోకిల

ఆ అమ్మాయి, రోజూ సరిగా అదే వేళకు అక్కడకు వస్తుంది. గోదావరి అలలమీంద గాలిబంతులులాగా ఎగరేసుకుంటూ వెన్నెలచారికలు చీకటిదొంతరలను తరమడం మొదలుపెట్టగానే, మోడైపోయిన చెట్టు, ఉగ్గం వేరుమీంద నుంచి, మోపినతల ఎత్తి, నేలను ఆసరాతీసుకుని లేచి, వంతెనమీందనుంచి వచ్చే రైలు పొల్లుకూతలో కలిపి, ఇగుర్చుకుపోయిన గుండెలువిచ్చేటంత కేకపెట్టి, బావురుమనడం, ఇంటిగుమ్మం ఎక్కేలోపల సముదాయించుకుంటుంది. పవల్లా ఇంటినిపడి వేయివెర్రులు ఎత్తినదానిలాగా తిరుగుతుంది. మౌనంగా సమాధిలో పడిపోయినట్టు సాలభంజికలాగా వ్రాలిపోతుంది. మూసినకన్ను సూర్యుడు క్రుంకుతూండగా ...ఏనుగంత సత్తువతో...గోదావరిగట్టుకు...ఎండిన మ్రాని మొదలుకు...

ఎందుకు వెళుతుందో తెలియదు. ఏమి కావాలి? ఏం హాయి అనుభవించాలి?— ఆమెకు కావలసినవాళ్ళే అర్థం తెముల్చుకోలేక ఆ ప్రశ్నలు వేసుకోవడం మానుకున్నారు: ఎక్కడకు వెళుతుందో, ఎప్పుడు వస్తుందో, గమనించరు.

ఏమీ అనరు. కలకలలాడే ముఖాలతో కాని, అవసరంవచ్చి నపుడన్నా పలుకరించరు.

ఆమె మానాన ఆమె బ్రతికి బాగుంటే చాలు... ఇష్టంవచ్చినట్టుగా ఉండటానికి ఎవరూ ఏఅభ్యంతరమూ చెప్పరు. కాని పనేమీ చేస్తూన్నదనికాదు వాళ్ళవాళ్ళ ఆవేదన...ఎంతటిఅకృత్యమైనా చేసి, ఆమె మళ్ళా బాహ్యస్మృతి తెప్పించుకుంటే, అదే చాలు.

పడుచుపిల్ల...నోరూరించగల వయసులోఉన్న సంపన్నులపడుచు ఒంటరిగా వేళగానివేళ, దొరికినప్పుడు, ఎంత సౌమ్యుడికైనా, నాడి కదనుత్రొక్కుతుంది. ఒకరిద్దరు, మీదుగా రాచుకుపోవడం, చేతికిచేయికలిపి నిలవేయడం— ఇలాంటి సన్నాహాలు చేసి చూశారు. కాని,దారుమూర్తిలాగా, స్పర్శను గమనించకుండా అడుగు నిలపకుండా, ఏవిధమైన ఖంగారూ లేకుండా...పోయే అమ్మాయి...మీద ఎన్ని భూతాలు ఆడుతూన్నవో అని భయపడి...ప్రాణంమీద ఆశఉన్నవా డెవడూ, ఆమెజోలికిరావడం మానివేయడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

'ఎవరమ్మా నీవు?'—ఎంతమంది ఎన్నిచోట్ల ఎన్ని వేళల్లో ఆప్రశ్న ఎన్నిగొంతులతో అడిగారు? చెవికెక్కిందా? ఇదీ వానిలోనే జమ.

'ఎవ రా కూర్చున్నది?'— రెండోనాడు ప్రశ్నలో

క్రమం మారింది కాని, ఆమెవాలకం, అంతమాత్రాన విన పడలేదు.

'ఎవరంటే...మాట్లాడవేం?'— రెండురోజులనుంచీ ఓపికగా చూస్తున్నాడు, ఆ షికారీ. లంకలలోకి పిట్టలవేటకు తెప్ప వేసుకు వెళ్ళి...ఆకాశం ఎఱ్రపడినతర్వాత నీటివాలున ఒడ్డుకుచేర్చి వెన్నెల వచ్చేదాకా తెడ్డుతో అలలు రేపుతూ, అనంతంలోకి చూస్తూ కూర్చునిఉంటాడు ఆ వయసుకాడు. ఎగువను గట్టుమీద పడుచు మెసలడం సడికట్టాడు. పలుక రింపులు వినిపించుకోకపోవడంమూలాన ఎవరో జగజంతకదా అని ఏనాటి కానాడు, నావలో అడుగు కారులో పెట్టేటప్పటికి మరచిపోయేవాడు. ఒకనాడు, రెన్నాళ్ళు...ఇక కథ కొంచెం ముదరనిద్దామనే ఉత్సాహం వేసింది. దగ్గరకు వెళ్ళాడు. వెన్నెల విచ్చగానే, చంద్రబింబంకన్న మెరిసింది ఆమె ముఖం. సూదివార ఎడంలేకుండా పూసుకుని నిలుచున్నాడు. ఆమె చలించలేదు. నల్లమాలిన చొరవచేసి, పెదవి ఎంగిలి చేశాడు. ముదురుపాకం హల్వాముక్కలాగా అధరం పలు మొనకు ఎదురుతిరిగి గంటును కోరుకుంది. చురుకుకు, ఆమె కళ్ళల్లోకి జీవం కమ్ముకువచ్చింది...చేరలకు మీారిపోయినది. ఆతనిమీదుగా గోదావరిలోకి చూసింది.

'రావూ...అలలలోనుంచి ఇంకా లేచిరావేం?'

ఆతనికి అర్థంకాలేదు. తనభయం మాపుకునేందుకు ఆమెను సందిటపట్టుకున్నాడు.

'నీలాగే నేనూ మునిగిపోతున్నాను.'

ఈ కేకలతో, ఆ సాహసికి వణుకుపుట్టుకువచ్చింది. కాని గంద్రగోళంగా ఆమె విషాద - గాథ అర్థంఅయింది.

'మాయపూతావా ... మునిగినచోటుకూడా దాచేసుకుంటున్నావా?'

ధైర్యంవచ్చి ... ముద్దులలో ఆమెకు ఊపిరి బెసగకుండా చేశాడు. వాడిన తామరతూడులాగా అయిపోయి, వాలిపోతే... చెట్టుమొదల జారవిడిచి కారుదగ్గరకు పరుగెత్తాడు.

ఆ మరునాడు...నీటిమీదుగా కాకుండా...కారులో యకాయకిని...గట్టుదగ్గరకు వచ్చేశాడు. చెట్టు...ఆ మోడు లేదు. నరుకులైన, తుండ్లరాసి చెల్లాచెదరుగా పడిఉంది. ఆ అమ్మాయీ లేదు.

మనసు నిలువక...ఎక్కడికీ పోవాలనే ఆలోచన లేకుండానే గట్టుపుచ్చుకుని ఎగువ ఎక్కుతున్నాడు; దూరాన... ఆమెజాడ కనిపించింది. బెదురుగా వెళ్ళాడు. చెంగున లేడిపిల్లలాగా ఆతనికౌగిటిలోకి దుమికి,

'వెన్నెల వచ్చినా...ఎంతసేపని నీకోసం వెదకాలి?, అన్నది.

'చీకటి అంటే నాకు భయం'

'నాకూ భయమే.'

'వద్దు. నీకు కావాలంటే నక్షత్రాలు చిదిపి దీపం పెడుతాను. మసకన్న మాట కనిపించదు.'

'సైఁ'

ఇద్దరూ చెట్టాపట్టాలు వేసుకుని, చిన్నపిల్లలులాగా గంతులు వేస్తూ పరుగెత్తారు. ఆమెనవ్వు తెరలు తెరలుగా పొర్లి...కారు హారన్‌లో లయించింది. గట్టుమీదికి ఏమూలగా చాలాదూరంవరకూ కారు జంటదీపాలు చీకటిని చీల్చి చెండాడడానికి వెదకుతూ దాడుతీస్తూన్నవి. దీపమాలికలాగా వంతెనమీదనుంచి రైలు రంయిన పరుగెత్తింది. గోదావరిలో ఉద్వోలంగా లేచిన కెరటం ఒడ్డుకు రాకుండానే చదునై వెన్నెలలో విరిగినంత మేరా ఒడిదుడుకులతో మిలమిల లాడింది.

—:o:—